నమస్తే తెలంగాణ
# యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, మంగళవారం 17 సెప్టెంబర్ 2024 YADADRI BHUVANAGIRI


భువనగిరి పెద్ద చెరువులో గణనాథుల నిమజ్జనం


భువనగిరిలో గణేషుడి శోభాయాత్ర

# ఓబొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా!

## లంబోదరుడికి ఘనంగా వీడ్కోలు

**ఎటుచూసినా చూసినా ఉత్సవ శోభ.. ఎక్కడ విన్నా గణపతి నామస్మరణ.. కోలాటాలు.. డీజే పాటలు.. బ్యాండ్ చప్పళ్లు.. తీన్మార్ స్టెప్పుల నడుమ లంబోదరుడిని నిమజ్జన శోభాయాత్రలు సాగాయి. నవరాత్రులు ఘనంగా పూజలు అందుకున్న గణనాథులను సోమవారం ప్రత్యేకంగా అలంకరించి వాహనాలపై భక్తిశ్రద్ధలతో తరలించి గంగమ్మ ఒడికి చేర్చారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు శోభాయాత్రలు వైభవంగా సాగాయి. మండపాల వద్ద లడ్డూ వేలం పాటలు పోటాపోటీగా నడిచాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుడా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.**

– భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 16

- జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా శోభాయాత్రలు
- 6వేలకుపైగా విగ్రహాల నిమజ్జనం
- అడుగడుగునా పోలీస్ నిఘా.. విధుల్లో 700 మందికి పైగా పోలీసులు
- నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన సీపీ సుధీర్‌బాబు


భువనగిరి శోభాయాత్రలో యువతుల నృత్యాలు

### చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

నిమజ్జనం కోసం పట్టణాలు, గ్రామాల్లోని చెరువుల వద్ద మత్స్య, నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భారీ క్రేన్లు, హైమాస్ట్ లైట్లు, టెంట్లు, తాగునీరు, అంబులెన్సులు, గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

### పోలీస్ పహారా

గణేశ్ నిమజ్జన శోభాయాత్ర అవాంచనీయ సంఘటను చోటుచేసుకోకుండా జిల్లావ్యాప్తంగా 700 మందికిపైగా పోలీసులను బందోబస్తులో ఉంచారు. భువనగిరి, బీబీనగర్ పెద్ద చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను సీపీ సుధీర్‌బాబు పరిశీలించారు. సీసీ కెమెరాల నిఘాలో శోభాయాత్ర సాగింది. డీసీపీ, అడిషనల్ డీసీపీ, ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు విధుల్లో పాల్గొన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పలుచోట్ల డైవర్షన్ చేశారు. శోభాయాత్రలో నిబంధనలు ఉల్లంఘించి వారిపై కఠిన చర్యలు ఉంటాయని డీసీపీ రాజేశ్‌చంద్ర చేసిన హెచ్చరిక మేరకు మేరకు భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో సహకరించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా వైన్ షాపులను బంద్ చేశారు.


భువనగిరి పెద్ద చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

### భువనగిరి పట్టణంలో వేడుకలు ఇలా..

- భువనగిరి పట్టణంలో వినాయక విగ్రహాలను పెద్దచెరువులో నిమజ్జనం చేశారు. రాయగిరి పరిధిలోని విగ్రహాలను రాయగిరి చెరువులో వేశారు.
- భువనగిరి పట్టణంలోని 2వవార్డు, సాయిబాబా దేవాలయం ఏరియా, హనుమాన్‌వాడ, సంజీవ్ నగర్ వినాయకులు శోభాయాత్రగా తరలి పాతబస్టాండ్ మెయిన్ రోడ్డులో కలిశాయి. శృతినగర్, ఆర్బీనగర్, అర్బన్ కాలనీ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పాత బస్టాండ్, వినాయక చౌరసా కొత్త బస్టాండ్, బాబుజగ్జీవన్ రామ్ చౌరస్తా వరకు కొనసాగింది. బాబుజగ్జీవన్ రామ్ చౌరస్తాలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ చౌరస్తాకు వచ్చిన వినాయక మండపాల కమిటీ సభ్యులను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించి, గణనాథులకు పూలు జల్లి స్వాగతం పలికారు.
- రామ్‌నగర్, న్యూరామ్‌నగర్, ఇంద్రానగర్, ఎల్బీనగర్, కామునికంత చౌరస్తా నుంచి సమ్మద్ చౌరస్తా వరకు, కుమ్మరివాడ, మసీద్, బాబుజగ్జీవన్‌రామ్ మెయిన్ రోడ్డు జంఖాన్‌గూడా ఎక్స్‌రోడ్ నుంచి సమ్మద్‌చౌరస్తా వరకు శోభయాత్రలు సాగాయి. సమ్మద్ చౌరస్తాకు చేరుకున్న వినాయక విగ్రహ కమిటీ సభ్యులకు, భక్తులకు ఒక పాట పాడే అవకాశం ఇవ్వడంతో ఆ చౌరస్తాలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. ఈ చౌరస్తా నుంచి హైదరాబాద్ చౌరస్తా మీదుగా భువనగిరి ట్యాంక్ వరకు శోభాయాత్ర సాగింది.
- బంజారాహిల్స్, తారకరామ్‌నగర్, కిసాన్‌నగర్, గంజ్, కరెంట్ ఆఫీస్, కుడివైపు వినాయక చౌరస్తా, కొత్త బస్టాండ్ నుంచి బాబుజగ్జీవన్‌రామ్ చౌరస్తా నుంచి సమ్మద్ చౌరస్తా, హైదరాబాద్ చౌరస్తా నుంచి పెద్ద చెరువుకు విగ్రహాలు చేరుకున్నాయి. తాతానగర్, ప్రగతినగర్ విగ్రహాలు ప్రభుత్వ ఆసుపత్రి, హైదరాబాద్ చౌరస్తా మీదుగా భువనగిరి చెరువుకు చేరుకున్నాయి. భువనగిరి నుంచి పెద్ద చెరువుకు వెళ్లే మార్గాన్ని కేవలం వెళ్లడానికి మాత్రమే అనుమతించారు. భువనగిరి పెద్ద చెరువు సమీపంలోని స్పిన్నింగ్ మిల్ ఆవరణలో గల ఖాళీ స్థలంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడి నుంచే వాహనాల్లో వచ్చిన విగ్రహాలను క్రేన్ల సాయంతో పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.
- విగ్రహాలను దింపిన వాహనాలు తిరిగి వెళ్లడానికి వచ్చిన మార్గంలో కాకుండా భువనగిరి చెరువు నుంచి హైవేలో మున్సిపల్ కార్యాలయం సమీపం నుంచి, ప్రభుత్వ గురుకుల కళాశాల మీదుగా పట్టణంలో మార్గం ఏర్పాటుచేశారు. ఇలా వినాయకుడి శోభాయాత్ర మంగళవారం తెల్లవారుజాము వరకు సాగింది.

### 6వేల విగ్రహాలు నిమజ్జనం..

గణేశ్ నవరాత్రు సందర్భంగా జిల్లాలో సుమారు ఆరువేల విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేశారు. భువనగిరి పెద్దచెరువు, ఆలేరులో గోధుమకుంటతోపాటు స్థానిక చెరువులు, భూదాన్ పోచంపల్లిలో స్థానిక చెరువుల్లో, బీబీనగర్‌లో పెద్దచెరువుతోపాటు రాఘవాపురం చెరువు, మండల కేంద్రంలోని చెరువు, యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన విగ్రహాలను చాకలిగిద్ద, రాయగిరి చెరువులో నిమజ్జనం చేశారు. భువనగిరి పట్టణంలోనే 195 ఏర్పాటు చేయగా, జియో ట్యాగింగ్ ప్రకారం వేసిన ఇచ్చిన సీరియల్ ఆధారంగా విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.


సూర్యాపేటలో ట్రాక్టర్ నడిపి శోభాయాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# గంగా జమునా తెహజీబ్ సంస్కృతికి మారుపేరు సూర్యాపేట

- కులమతాలకు అతీతంగా పండుగలు
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 16 : అన్ని మతాలు, కులాల వాళ్లు కలిసి పండుగలు చేసుకుంటూ సూర్యాపేటను గంగా జమునా తెహజీబ్ సంస్కృతికి ప్రతీకగా నిలుపుతున్నారని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని వేదాంత భజన మందిరంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతి విగ్రహానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో చాలావరకు గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ముస్లింలు పాల్గొన్నారన్నారు. పట్టణ చరిత్రలో ఇప్పటి వరకు అవాంఛనీయ సంఘటనలేవీ జరుగకుండా గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఎప్పటిలాగే అన్ని రాజకీయ పార్టీలు కలిసి వచ్చి వేడుకలు నిర్వహించడం మంచి విషయమన్నారు.

సూర్యాపేట బొడ్రాయి పునఃప్రతిష్ట విషయంలో అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగాలన్నారు. గణేశ్ నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో జరిగేందుకు కృషి చేసిన ఉత్సవ కమిటీలకు శుభాకాంక్షలు తెలిపారు.



విద్యుద్దీపాల వెలుగులో పోలీస్ పరేడ్ గ్రౌండ్

# ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- హాజరుకానున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 16 : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న వేడుకలకు భవనాన్ని విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. అనంతరం జిల్లా ప్రగతిపై ఆయన ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# 'ఇన్‌స్పైర్-మనక్' కు పెరిగిన నామినేషన్లు

- మూడు రోజుల్లోనే 264 నామినేషన్లు
- అక్టోబర్ 20 వరకు గడువు పెంచిన ప్రభుత్వం

రామగిరి, సెప్టెంబర్ 16: పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాన్ని పెంచేందుకు నిర్వహించే 'ఇన్‌స్పైర్-మనక్' నామినేషన్స్(దరఖాస్తులు) భారీగా పెరిగాయి. నామినేషన్స్ తక్కువగా వస్తున్న విషయమై 'ఏదీ ఇన్‌స్పైర్' అనే శీర్షికన నమస్తే తెలంగాణలో ఈ నెల 13న కథనం ప్రచురితమైంది. అప్పటి వరకు(ఈ నెల 13) జిల్లాలో 1,022 నామినేషన్స్ మాత్రమే వచ్చాయి. దాంతో స్పందించిన విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను చైతన్యపర్చారు. దాంతో ఈ నెల 15వరకు మూడు రోజుల్లోనే 264 నామినేషన్స్ వేయగా.. జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నాటికి మొత్తం 1,286 నమోదైనట్లు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి వెల్లడించారు. దాంతో పాటు నామినేషన్స్ గడువు ఈ నెల 15తో ముగియగా దానిని అక్టోబర్ 20 వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు.

# మీ సేవ సర్వర్ డౌన్

- మూడు రోజులుగా నిలిచిన సేవలు

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబర్ 16 : మండలంలోని పలు మీ సేవ కేంద్రాల్లో మూడు రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. పోర్టల్ పని చేయక పోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన సర్వర్‌లో టెక్నికల్ సమస్య తలెత్తడంతో సేవలు నిలిచిపోయినట్లు సంబంధీకులు తెలుపుతున్నారు. జనన, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు కావలసినవారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చింది. సర్వర్లో సాంకేతిక సమస్యతో ప్రింట్ కూడా రావడం లేదు. రెండో శనివారం, ఆదివారం, సోమవారం వరుస సెలవులు ఉండడంతో టెక్నికల్ సమస్యను పరిష్కరించలేదు. మంగళవారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇబ్బంది లేకుండా సేవలను త్వరగా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

# సాగర్ తొణికిసలాడుతున్నా సాగునీటి జాడేది?

- డీ 40 కాల్వ కింద ఎండుతున్న పంటలు
- నాలుగు మండలాల పరిధిలో అవస్థలు
- సాగునీటి విడుదల కోసం రోడ్డెక్కిన రైతాంగం

తిప్పర్తి, సెప్టెంబర్ 15 : నాగార్జునసాగర్ నిండు కండలా తొణికిసలాడుతున్నా ఏఎమ్మార్పీ పరిధిలోని రైతులకు సాగు నీరు అందడం లేదు. అధికారుల నిర్వహణ లోపం డీ-40 కాల్వ ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. మొదట కాల్వకు నీళ్లు ఇచ్చినా గండ్లు, ఏపుగా పెరిగిన కంపచెట్ల కారణంగా పంటలకు సాగు నీరు అంద లేదు. గండ్లు పూడ్చేందుకు వారం కింద నీటి విడుదల ఆపేసిన అధికారులు, ఆ తర్వాత పుట్టంగండి వద్ద మోటార్ రిపేర్ అయ్యిందని తిరిగి పునరుద్ధరించకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దాంతో ఐదు మండలాల రైతులు అవస్థలు పడుతున్నారు.

డీ-40 కాల్వ కింద మొత్తం 27,100 ఎకరాల ఆయకట్టుకుగానూ కుడివైపు తొమ్మిది, ఎడమ వైపు పది సబ్ కెనాల్స్ ఉన్నాయి. ఇది కట్టంగూర్ మండలం బొల్లెపల్లి నుంచి మాడ్గులపల్లి మండలం సీత్యాతండా వరకు 22.8 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. ఈ కాల్వల ద్వారా కట్టంగూరు, తిప్పర్తి మండలంతోపాటు మాడుగులపల్లి, వేములపల్లి మండలాల రైతులు తమ పొలాలు సాగు చేసుకుంటున్నారు. ప్రారంభంలో రైతులు పెట్టే అక్రమ గండ్ల కారణంగా చివరనున్న రైతులకు సాగు నీరు అందలేదు. మరోవపు కాల్వలకు మరమ్మతులు చేపట్టక పోవడంతో కంప చెట్లు కాల్వ నిండిపోయాయి. దాంతో కాల్వ పొంగి తరుచూ గండ్లు పడడం జరిగింది. ఇటీవల తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు-వెంకటాద్రి పాలెం వద్ద ఈ కాల్వకు గండి పడటంతో సమీప రైతుల పంటలు మునిగాయి. దీన్ని పూడ్చడానికి అధికారులు నానా యాతన పడాల్సి వచ్చింది. డీ 40 కాల్వకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిప్పర్తి మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. వానకాలం సీజన్ ముగిసే దశకు వచ్చినా నేటికీ కాల్వకు నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి వెంటనే నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.



డీ40 కాల్వ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు


డీ-40 కాల్వ పరిస్థితి


### తూకం మడి కూడా పారుతలేదు



నాకు మూడెకరాల భూమి ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కాల్వ మంచిగ పారింది. నా చెల్క మొత్తం అచ్చుగట్టిన. ఎనిమిదేండ్లు వడ్లు పండినయి. ఈ ఏడు మొన్న యాసంగిలో కాల్వ రాక బోరు కూడా పొయ్యలేదు. ఇప్పుడు సాగర్‌లో నీళ్లు ఉన్నా ఇవ్వడం లేదు. అప్పడప్పుడు గిన్ని గిన్ని వస్తే కనీసం తూకం మడి కూడా పారుతలేదు. కాల్వ వస్తుందని ఇంకో మడి దున్నితే అప్పుడే కాల్వ పోయింది. మళ్లీ ఎప్పుడొస్తుందో ఏమో. నిన్న మొన్న వర్షాలొచ్చి కొంత మేలు అయ్యింది. తొందరగా కాల్వకు నీళ్లిచ్చి ఆదుకోవాలి.

**- కొమ్మనబోయిన నర్సయ్య, రైతు, సర్వారం, తిప్పర్తి మండలం**

### నీళ్ల కోసం గతంలో ఇంత ఇబ్బంది పడలేదు



నాకు 10ఎకరాల భూమి ఉంది. కాల్వకు నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న బోర్లు సరిగా పోయక మూడు ఎకరాలే నాటు పెట్టిన. అది కూడా కొసెల్తదో లేదో అన్నట్టుంది. చాలామంది రైతులు భూములు పడావు బెట్టుకుండ్రు. నీళ్ల కోసం గతంలో ఇంతగానం ఇబ్బంది పడలేదు. ముందున్న రైతులు కొందరు కాల్వకు గండికొట్టి గూనలు వేసుకుండ్రు. అధికారులు వాటిని తీయించాలి.

**- చెదురుపల్లి భిక్షం, సిలార్మియాగూడెం, తిప్పర్తి మండలం**

### వారబందీగా నీళ్లు వదులుతున్నాం



మోటర్లు రిపేరు వల్ల ప్రారంభంలో నీళ్లు రాలేదు. మోటర్ రిపేరు అయిన తర్వాత పూర్తిగా నీళ్లు వస్తున్నాయ్. ఏఎమ్మార్పీకి వారంబందీ పద్ధతితో నీళ్లు వదులుతున్నాం. ప్రస్తుతం సగం వరకే నీళ్లిచ్చాం. మరో దశలో కాల్వ చివరి వరకు నీళ్లు ఇస్తాం. అక్కడక్కడ రైతులు పెట్టిన అక్రమ గండ్లను గుర్తించి తొలగించాం. సిబ్బందితో ఎప్పడికప్పుడు పర్యవేక్షణ చేయిస్తున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా కింది వరకు సాగు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

**- సురేందర్ రావు, ఈఈ, ఇరిగేషన్ శాఖ**